సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 26 । జనవరి । 2023



టమాట కిలో రూ.14

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.14, కనిష్టంగా రూ.4.50 ప్రకారం ధర పలికింది.



టన్ను చీనీ రూ.30 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.30 వేలు, కనిష్టంగా రూ.12 వేలు, సరాసరి రూ.15 వేల చొప్పున పలికాయి.

గరిష్టం/కనిష్టం 31.7°/ 13.6°

జిల్లా పరిధిలో బుధవారం చలి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగాను పెరిగాయి. గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఆశల పట్టు.. ధర అదిరేట్టు

- ‘పురం’లో కిలో బైవోల్టిన్ గరిష్ట ధర రూ.745



మార్కెట్‌లో అమ్మకానికి ఉంచిన పట్టుగూళ్లు

హిందూపురం: పట్టుగూళ్ల ధరలు రయ్యిమంటూ దూసుకెళ్తున్నాయి. బుధవారం హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్‌లో కిలో బైవోల్టిన్ రకం అత్యధికంగా రూ.745 పలికింది. వివిధ ప్రాంతాల రైతులు మార్కెట్‌కు 134 లాట్లు 7,086 కిలోల పట్టుగూళ్లను తీసుకువచ్చారు. ఇందులో కిలో బైవోల్టిన్ గరిష్టంగా రూ.745, కనిష్టంగా రూ.662, సరాసరిన రూ.694 ధరల క్రయవిక్రయాలు జరిగాయి. మడకశిర, హిందూపురం, కళ్యాణదుర్గం ప్రాంతాల రైతులు పండించిన గూళ్లు నాణ్యంగా ఉండటంతో ధర కూడా అధికంగా దక్కింది.

1.78 లక్షల క్వింటాళ్ల విత్తన వేరుశనగ కేటాయింపు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్‌–2023కు సంబంధించి ఉమ్మడి అనంతపురం జిల్లాకు 1.78 లక్షల క్వింటాళ్ల రాయితీ విత్తన వేరుశనగ కేటాయించినట్లు వ్యవసాయ, ఏపీ సీడ్స్ వర్గాలు తెలిపాయి. ఇందులో మొదటి విడత కింద లక్ష క్వింటాళ్లు శ్రీసత్యసాయి జిల్లాకు, 78 వేల క్వింటాళ్లు అనంతపురం జిల్లాకు కేటాయించారని పేర్కొన్నాయి. డిమాండ్, అవసరాన్ని బట్టి రెండో విడత కేటాయింపులు ఉంటాయని వెల్లడించాయి. మే చివరి వారం నుంచి జూన్ ఆఖరు దాకా రాయితీపై రైతులకు విత్తన పంపిణీ చేస్తామని పేర్కొన్నాయి. ప్రభుత్వం ఆదేశాల మేరకు కే–6, కదిరి–లేపాక్షి 1812 రకం విత్తన వేరుశనగతో పాటు ఖరీఫ్‌లో కందులు, చిరుధాన్యాలు, జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు కూడా రాయితీతో ఇవ్వడానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించాయి.

డాక్టర్ సంపత్‌కుమార్‌కు జాతీయ పురస్కారం



జాతీయ పురస్కారంతో డాక్టర్ సంపత్‌కుమార్

కదిరి: స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సంపత్‌కుమార్‌కు జాతీయ పురస్కారం దక్కింది. కొత్త రకం వేరుశనగ వంగడాలను కనుగొనడంలో ఆయన చేసిన కృషికిగాను భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి ఆధ్వర్యంలో నడిచే భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ ఆయనకు అవార్డు ప్రకటించింది. ఈ నెల 23న హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సంపత్‌కుమార్ జాతీయ పురస్కారం అందుకోవాల్సి ఉన్నప్పటికీ అనివార్య కారణాలతో ఆయన పురస్కారా ప్రదానోత్సవంలో పాల్గొనలేక పోయారు. దీంతో నిర్వాహకులు ప్రశంసాపత్రంతో పాటు గోల్డ్ మెడల్‌ను రిజిస్టర్ పోస్టు చేయగా, అది బుధవారం ఆయనకు అందింది. డాక్టర్ సంపత్‌కుమార్ మూడు దశాబ్దాలుగా వ్యవసాయ శాస్త్రవేత్తగా సేవలనందిస్తూ అధిక దిగుబడి నిచ్చే 10 కొత్త రకం కదిరి వేరుశనగ రకాలను కనుగొన్నారు. ఈ వంగడాలు దేశ వ్యాప్తంగా సాగులో ఉన్నాయి. తనకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం పట్ల ఆయన ‘సాక్షి’తో తన సంతోషాన్ని వెలిబుచ్చారు. తోటి వ్యవసాయ శాస్త్రవేత్తలు డా.ప్రసన్న రాజేష్, డా.వేమన, డా.నీలిమ, డా.వెంకటరమణ ఆయన్ను అభినందించారు.

పారిశ్రామిక పరుగులు!

పరిశ్రమల ఖిల్లా... శ్రీ సత్యసాయి జిల్లాలో పారిశ్రామిక ప్రగతి పరుగులు పెడుతోంది. అనుకూలమైన వాతావరణం ఉండటంతో పాటు ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తుండటంతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు. ఫలితంగా మూడున్నరేళ్లలో పదుల సంఖ్యలో పరిశ్రమల ఏర్పాటుతో పాటు వేలాది మందికి ఉద్యోగాల అవకాశాలు దక్కాయి.

- శ్రీసత్యసాయి జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి
- మూడున్నరేళ్లలో భారీగా పరిశ్రమల స్థాపన
- రూ.కోట్ల పెట్టుబడులతో పరిశ్రమల ఏర్పాటు
- వేలాది మందికి ఉపాధి అవకాశాలు

22 మూడున్నరేళ్లలో జిల్లాలో స్థాపించిన భారీ పరిశ్రమలు

రూ.14,790 కోట్లు భారీ పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడులు

12,785 భారీ పరిశ్రమలతో కొత్తగా దక్కిన ఉద్యోగాలు

1,532 జిల్లా వ్యాప్తంగా స్థాపించిన సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు

రూ.674 కోట్లు సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల కోసం వెచ్చించిన పెట్టుబడి

11,312 కొత్తగా దక్కిన ఉద్యోగాల సంఖ్య



సాక్షి ప్రతినిధి, అనంతపురం: జగన్ సర్కారు వెన్నుదన్నుతో శ్రీ సత్యసాయి జిల్లా పారిశ్రామికంగా దూసుకెళుతోంది. భారీ, మధ్యతరహా, సూక్ష్మ పరిశ్రమల స్థాపనలో గతంలో ఎన్నడూ లేనంతగా దూకుడు పెరిగింది. తద్వారా స్థానిక యువతకు భారీగా ఉద్యోగావకాశాలు దక్కాయి.

దరఖాస్తు చేసుకుంటే చాలు..

వైఎస్ జగన్ సర్కార్ పారిశ్రామిక ప్రగతిపై దృష్టి సారించింది. అనుమతుల మంజూరుతో పాటు భారీగా రాయితీలు ఇస్తూ ప్రోత్సహిస్తోంది. అందువల్లే మూడున్నరేళ్లలోనే జిల్లాలో ఏర్పడిన వివిధ పరిశ్రమల స్థాపన ద్వారా 24 వేలమందికి ఉద్యోగావకాశాలు లభించాయి. సింగిల్ డెస్క్ పాలసీ ద్వారా దరఖాస్తు చేసుకున్న వెంటనే అనుమతులు ఇవ్వడం, బ్యాంకు లింకేజీ, ప్రభుత్వ సబ్సిడీ, తక్కువ ధరకు ప్రభుత్వ భూములు ఇవ్వడం వంటి చర్యల వల్ల జిల్లాలో పెట్టుబడులు పెట్టేందుకు వివిధ ప్రాంతాల నుంచి ఔత్సాహికులు తరలివస్తున్నారు.



ఇది 2020 సంవత్సరంలో పెనుకొండ నియోజకవర్గం గుడిపల్లి వద్ద రూ.50 కోట్లతో ఏర్పాటైన సింటెక్స్ (కార్ల అద్దాల తయారీ) పరిశ్రమ. నాలుగెకరాల్లో ఏర్పాటైన ఈ పరిశ్రమలో ఇప్పుడు 250 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

రూ.15,464 కోట్ల పెట్టుబడులు..

జిల్లాలో భారీ పరిశ్రమలు, ఎంఎస్‌ఎంఈలు (సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలు) స్థాపనలో భాగంగా మూడున్నరేళ్లలో రూ.15,464 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. దీన్నిబట్టే పారిశ్రామికంగా శ్రీసత్యసాయి జిల్లా ఎంత అనువైనదో అంచనా వేయవచ్చు. జిల్లాలోని హిందూపురం, పెనుకొండ ప్రాంతాల్లో అనువైన వాతావరణం ఉండటంతో ఎక్కువ పరిశ్రమలు వచ్చాయి. భారీ ప్రాజెక్టులతో రూ.14,790 కోట్లు, ఎంఎస్‌ఎంఈల ద్వారా రూ.674 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. భారీ పరిశ్రమల్లో 12,785 మందికి, చిన్న ప్రాజెక్టుల్లో 11,312 మందికి ఉద్యోగాలు లభించాయి.

అధికారులు వెంటనే స్పందించారు



సీపీవీసీ మెటీరియల్ ఏర్పాటు చేద్దామని ముందుగా కర్ణాటకలో దరఖాస్తు చేసుకున్నా. ఆరు మాసాలైనా స్పందన రాలేదు. దీంతో శ్రీ సత్యసాయి జిల్లా పరిశ్రమలశాఖ పోర్టల్‌లో దరఖాస్తు చేశా. వెంటనే అధికారులు ఫోన్‌చేసి ప్రోత్సహించారు. భూముల కేటాయింపు మొదలుకొని అన్ని అనుమతులు వెంటనే ఇచ్చారు. దీంతో రూ.7 కోట్లతో ప్రైమ్ ఇంటర్నేషనల్ కంపెనీ పెట్టా. 200 మందిపైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. – డాక్టర్ నాగేంద్ర (ఆర్థోపెడిక్), బెంగళూరు

పాలసీ మారాక మంచి ప్రగతి

సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల పాలసీలో మార్పులు వచ్చాయి. కొత్త పాలసీ తీసుకువచ్చాక కంపెనీల ఏర్పాటు సులభతరమైంది. చాలామంది ఔత్సాహికులు ముందుకు వస్తున్నారు. ఉద్యోగావకాశాలు బాగున్నాయి.

– చాంద్‌బాషా, జనరల్ మేనేజర్, పరిశ్రమలశాఖ

ఇక్కడే ఉద్యోగం



గుడిపల్లి సమీపంలో సింటెక్స్ కంపెనీ ఏర్పాటయ్యాక నాకు ఉద్యోగం వచ్చింది. నెలకు రూ.15 వేల వేతనం వస్తోంది. నాలాంటి వాళ్లు చాలామంది ఇక్కడ పనిచేస్తున్నారు.

– మాల హరి, సోమందేపల్లి

సైబర్ నేరాలను అరికట్టాలి



పోలీస్ అధికారులకు శిక్షణ ఇస్తున్న ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్

పుట్టపర్తి అర్బన్: ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి సైబర్ నేరాలను పూర్తిగా అరికట్టాలని ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ సిబ్బందికి సూచించారు. ఇప్పటికే నమోదైన సైబర్ కేసులను సాంకేతికంగా దర్యాప్తు చేయాలన్నారు. బుధవారం ఆయన ఏఎస్పీ రామకృష్ణప్రసాద్, అనంతపురం పోలీస్ ట్రైనింగ్ కళాశాల ఆర్ఎస్ఐ వేణుగోపాల్‌తో కలిసి జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ఒక్క రోజు శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు. ఫేక్ లోన్ యాప్, ఆన్‌లైన్ ఛాటింగ్, పోక్సో కేసులు, ఆన్‌లైన్ వేధింపులు తదితర కేసులు, దర్యాప్తులో తీసుకోవాల్సిన అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..ప్రస్తుతం సైబర్ నేరాలు అధికమవుతున్నాయని, టెక్నాలజీ ఉపయోగిస్తే ఆయా కేసుల్లో దర్యాప్తు సులవుతుందన్నారు. ముఖ్యంగా సైబర్ నేరంపై ఫిర్యాదు అందగానే పోలీసులు స్పందిస్తే బాధితులు న్యాయం జరిగే అవకాశం ఉంటుందన్నారు. ఈ మేరకు అందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సైబర్ సెల్ సిబ్బంది, ఎస్ఐలు, ఎస్‌హెచ్‌ఓలు, క్యాట్ టీం, ఐటీ కోర్ సిబ్బందికి సైబర్ కేసుల దర్యాప్తుపై సూచనలు, సలహాలు ఇచ్చారు. సైబర్ నేరాలపై వేగంగా స్పందించాలన్నారు.

రెండో విడత వెటర్నరీ అంబులెన్స్‌లు మంజూరు



వైఎస్సార్ సంచార పశువైద్యశాల వాహనం

అనంతపురం అగ్రికల్చర్: పల్లెపల్లెకూ పశువైద్యసేవలు అందించే డాక్టర్ వైఎస్సార్ సంచార పశువైద్యశాలలు (మొబైల్ వెటర్నరీ అంబులేటరీ క్లినిక్) రెండో విడత కింద నియోజకవర్గానికి ఒకటి చొప్పున మంజూరయ్యాయి. తొలివిడతగా గతేడాది మే 19న నియోజకవర్గానికి ఒకటి చొప్పున మంజూరైన అత్యాధునిక సదుపాయం కలిగిన సంచార వాహనాలు జిల్లాలో విశిష్ట సేవలు అందిస్తున్నాయి. 108 మాదిరిగా... వెటర్నరీ వాహనాల సేవలు వినియోగించుకునేందుకు 1962 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేస్తే... తక్షణం స్పందించి పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలు.. ఇతరత్రా మూగజీవాలకు వైద్యసేవలు అందిస్తున్నాయి. తాజాగా రెండో విడత కింద కింద అనంతపురం జిల్లాకు 6, సత్యసాయి జిల్లాకు 8 వాహనాలు కేటాయించినట్లు పశుశాఖ జిల్లా అధికారి డాక్టర్ వై.సుబ్రమణ్యం ‘సాక్షి’కి తెలిపారు. ఈ వాహనాలు గురువారం లేదా శుక్రవారంలోపు చేరుతాయన్నారు. దీంతో ప్రతి నియోజకవర్గానికి రెండు మొబైల్ వెటర్నరీ అంబులెన్స్ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు.

దూరవిద్య బీఈడీ ఫలితాలు విడుదల

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం దూరవిద్య బీఈడీ రెండో సంవత్సరం ఫలితాలను బుధవారం వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి విడుదల చేశారు. మొత్తం 362 మంది పరీక్షలకు హాజరుకాగా, 342 మంది విద్యార్థులు (94.48శాతం) ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ ఎ.మల్లికార్జునరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కె.శ్రీరాములు నాయక్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ చంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ





ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్, విద్యార్థికి ఓటరు గుర్తింపు కార్డును అందజేస్తున్న దృశ్యం

- ప్రతి ఒక్కరూ ఓటు విలువ తెలుసుకోవాలి
- జాతీయ ఓటర్ల దినోత్సవంలో కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: ఓటు ప్రజాస్వామ్యానికి పునాది లాంటిదని కలెక్టర్ బసంత్‌కుమార్ అన్నారు. దేశ భవితను మార్చే శక్తి ఓటుకే ఉందన్నారు. 13వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పుట్టపర్తి మండలం జగరాజుపల్లి వద్ద ఉన్న మంగళకర ఎడ్యుకేషన్ ట్రస్ట్‌లో కళాశాల విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ఓటు విలువ తెలుసుకోవాలన్నారు. ఓటు హక్కును ఒక వజ్రాయుధంలా వినియోగించుకుంటూ ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదిగా నిలవాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారంతా కచ్చితంగా ఓటరుగా నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకోవడానికి వంద శాతం ఓటింగ్ ప్రక్రియలో పాల్గొనాలన్నారు. అనంతరం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. యువ ఓటర్లకు ఓటరు ఎపిక్ కార్డులను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, ఎన్నికల తహసీల్దార్లు శ్రీనివాసులు, మైనుద్దీన్, మంగళకర కరస్పాండెంట్ సురేష్‌కుమార్, తహసీల్దార్ నవీన్‌కుమార్, డీటీ నరసింహులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఓటరు దినోత్సవం..

పుట్టపర్తి టౌన్: కలెక్టరేట్‌లో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బసంత్‌కుమార్ జాతీయగీతం ఆలపించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డివిజన్, మండల స్థాయి అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు.

రూ.లక్ష డిపాజిట్ చేస్తే రోజుకు వెయ్యి!

- వ్యాపారి మాట నమ్మి భారీగా డిపాజిట్లు
- రూ.2.5 కోట్లతో పరారైన వడ్డీ వ్యాపారి
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బాధితులు

సోమందేపల్లి: రూ.లక్ష డిపాజిట్ చేస్తే రోజుకు రూ.వెయ్యి ఇస్తానని ఓ వ్యక్తి చెప్పగా..అధిక వడ్డీకి ఆశపడిన జనం భారీగా సమర్పించుకున్నారు. అంతా సర్దుకుని సదరు వ్యాపారి పరారుకాగా, తాము మోసపోయామని బాధితులు పోలీస్ స్టేషన్ మెట్లెక్కారు. వివరాల్లోకి వెళితే...సోమందేపల్లిలోని చికెన్ రెడ్డి కాంప్లెక్స్‌లో మనోహర్‌రెడ్డి అనే వ్యక్తి వడ్డీ వ్యాపారం పేరిట కార్యాలయం తెరిచాడు. తనకు చక్కెర పరిశ్రమతోపాటు సిగరెట్ కంపెనీల్లో షేర్లు ఉన్నాయని, వాటి ద్వారా వచ్చే ఆదాయంపై ఇన్‌కం ట్యాక్స్‌కు కడుతున్నానని, ఇప్పటి నుంచి ప్రజలకే ఇవ్వాలనుకుంటున్నట్లు అందరినీ నమ్మించాడు. అయితే ఇందుకు తన వద్ద రూ.లక్ష డిపాజిట్ చేస్తే రోజూ రూ.1000 ఇస్తానని ఆశపెట్టాడు. అతని డాబు, దర్పం చూసి జనం బాగా నమ్మారు. నెల రోజులుగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారు రూ.లక్షలు అతని వద్ద డిపాజిట్లు చేశారు. చెప్పిన ప్రకారం కొద్దిరోజుల పాటు కొందరికి రోజూ వారీ వడ్డీ చెల్లించాడు. దీంతో వారు తమకు తెలిసిన వారితో కూడా రూ.50 వేలు నుంచి రూ.3 లక్షల వరకు డిపాజిట్ చేయించారు. అయితే మనోహర్‌రెడ్డి పదిరోజులుగా ఎవరికీ వడ్డీ డబ్బు చెల్లించకపోవడంతో అప్రమత్తమైన డిపాజిట్‌దారులు మంగళవారం అతన్ని నిలదీశారు. తాము కట్టిన డబ్బులు వెనక్కి ఇవ్వాలని కోరారు. దీంతో తన బండారం బయట పడిందని భావించిన మనోహర్‌రెడ్డి కార్యాలయానికి తాళాలు వేసి ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. దీంతో తాము మోసపోయామని భావించి బాధితులు బుధవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకు ఏడుగురు బాధితులు రూ.1.7 కోట్లు డిపాజిట్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుల్లో మరి కొంతమంది ఉద్యోగులు, ప్రముఖులు ఉండగా కేసు పెట్టేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. మొత్తంగా రూ.2.50 కోట్లు మనోహర్‌రెడ్డి స్వాహా చేసినట్లు బాధితులు చెబుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు.

సైనికుల పల్లి శెట్టిపల్లి

చుట్టూ కొండలు. పట్టణానికి పాతిక కిలో మీటర్ల దూరం. గ్రామంలో అడుగుపెడితే దేశభక్తి ఉప్పొంగుతుంది. పెద్దయ్యాక ఏమవుతావని ఏ చిన్నారిని అడిగినా ఆర్మీలో చేరతాననే సమాధానం వినిపిస్తుంది. దేశ రాజకీయాలు పెద్దగా పట్టని పల్లెవాసులు.. కానీ వీర జవానుల వీరోచిత గాథలను మాత్రం కంఠాపాఠంగా చెబుతారు. ఆ గ్రామమే శెట్టిపల్లి. నాలుగు దశాబ్దాలుగా ఎందరో సైనికులను దేశానికి అందించిన ఆ గ్రామం.. మరెందరినో దేశసేవకు పంపేందుకు సిద్ధంగా ఉంది.

- దేశ రక్షణలో గ్రామ యువత
- ఇప్పటికే వివిధ హోదాల్లో 40 మందికిపైగా సేవలు
- నాలుగు దశాబ్దాలుగా దేశ సేవలో తరిస్తున్న గ్రామం





ఢిల్లీలో విధులు నిర్వహిస్తున్న వెంకటేష్ నాయక్, శెట్టిపల్లి గ్రామం

పెనుకొండ రూరల్: మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామ జనాభా 2,811 మంది. అందరిదీ వ్యవసాయ నేపథ్యమే. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాలు ఎన్నో. కానీ ఈ గ్రామానికో ప్రత్యేక ఉంది. సైనికుల గ్రామంగా జిల్లాలోనే ప్రసిద్ధి పొందింది. ఈ గ్రామానికి చెందిన 42 మంది దేశ రక్షణలో పాలుపంచుకుంటున్నారు.

రామాంజనేయులుతో మొదలు..

1974 సంవత్సరంలో గ్రామం నుంచి మొదట మకుగూరి రామాంజనేయులు జవాన్‌గా ఆర్మీలో చేరారు. సికింద్రాబాద్ ఆర్మీ కళాశాలలో శిక్షణ పొంది జార్ఖండ్, కశ్మీర్ తదితర ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు. ఆయన 1994 పదవీ విరమణ పొందారు. ఆ తర్వాత 1974 సంవత్సరంలో సోమశేఖర్, 1975 సంవత్సరంలో అంజనేయులు నాయక్, దూదేకుల బాబు ఆర్మీలో చేరారు. వీరంతా ఎప్పుడు గ్రామానికి వచ్చినా జవానుల గురించి, భారత సైన్యం సాహసాల గురించి గొప్పగా చెప్పేవారు. యువతకు దేశభక్తిని నూరిపోసేవారు. ఫలితంగా ఒక్కొక్కరుగా మొదలై ప్రస్తుతం 42 మంది గ్రామస్తులు బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఐటీబీటీ, పారా మిలటరీ, అస్సాం రైఫిల్స్, ఎస్ఎస్‌బీ వంటి విభాగాల్లో వివిధ హోదాల్లో సేవలందిస్తున్నారు.

పెద్దల బాటలోనే యువత..

దేశ సరిహద్దులో విధులు చాలా సాహసంతో కూడుకున్నవి. ఎముకలు కొరికే చలి. తీవ్రవాదుల దాడులు. అపాయం ఏ వైపు నుంచి ఎప్పుడు మీద పడుతుందో తెలియదు. ఇలాంటి విధుల్లో శెట్టిపల్లి వాసులు ఎందరో పేరు తెచ్చుకున్నారు. వారి స్ఫూర్తితోనే ప్రస్తుతం గ్రామంలోని యువత కూడా దేశ సేవకు సిద్ధమవుతున్నారు. వీరిని గ్రామ పెద్దలూ ప్రోత్సహిస్తున్నారు.

చిన్నాన్న స్ఫూర్తితో...



నేను 2001లో బీఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్‌గా చేరారు. గుజరాత్, పంజాబ్, కశ్మీర్ తదితర ప్రాంతాల్లో విధులు నిర్వర్తించా. ప్రస్తుతం హెడ్ కానిస్టేబుల్‌గా రాజస్థాన్‌లో విధులు నిర్వర్తిస్తున్నా. మా చిన్నాన్న సోమశేఖర్ స్ఫూర్తితో ఆర్మీలో చేరాను.

– బాబు, బీఎస్ఎఫ్ జవాను, శెట్టిపల్లి

మాకెంతో గర్వకారణం



మా గ్రామస్తులు దేశ సేవలో పాలుపంచుకోవడం మాకు చాలా గర్వకారణం. అందరూ కష్టపడి చదువుకున్నారు. గ్రామంలో ఉన్నత పాఠశాల లేక రోజూ పక్కఊరికి నడిచివెళ్లేవారు. కష్టం మా పిల్లలకు బాగా తెలుసు. అందుకే సైన్యంలో విజయవంతంగా రాణిస్తున్నారు. గ్రామంలోని యువత కూడా దేశ సేవకే మొగ్గుచూపుతోంది.

– శివానందరెడ్డి, శెట్టిపల్లి

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం



పరేడ్ గ్రౌండులో స్టాల్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు



రిహార్సల్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్

పుట్టపర్తి అర్బన్: గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధమైంది. జిల్లా ఏర్పాటు తర్వాత తొలిసారి నిర్వహిస్తున్న వేడుకలు కావడంతో అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు పుట్టపర్తి సమీపంలోని ప్రశాంతిగ్రామం వద్ద ఉన్న శిరసాని హిల్స్ పరేడ్ గ్రౌండును తీర్చిదిద్దారు. బుధవారం కలెక్టర్ బసంత్‌కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్‌సింగ్, ఇతర జిల్లా అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వేడుకల్లో జిల్లాలోని ఎమ్మెల్సీలు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొనున్నారు.

ఉదయం 8.30 గంటలకే ప్రారంభం..

గురువారం ఉదయం 8.30 గంటలకే గణతంత్ర వేడుకలు ప్రారంభం కానున్నాయి. 9 గంటలకు కలెక్టర్ బసంత్‌కుమార్ జాతీయ పతాకావిష్కరణ చేయనున్నారు. అనంతరనం పరేడ్ సమీక్ష, సాయుధ దళాల గౌరవ వందనం సమర్పన, 9.30 గంటలకు జిల్లా ప్రగతి నివేదికపై కలెక్టర్ ప్రసంగం, ప్రగతి రథాల ప్రదర్శన, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, 10.45 గంటలకు విశిష్ట సేవలకు ప్రశంసా పత్రాలు అందజేత, 11.10 గంటలకు స్టాల్స్ సందర్శన కార్యక్రమాలుంటాయని డీఆర్‌ఓ కొండయ్య తెలిపారు. అలాగే సాయంత్రం 5 గంటలకు పుట్టపర్తి సాయి ఆరామంలో జాతీయ సమగ్రతపై బహిరంగ సభ, ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆయన వెల్లడించారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన బాలికల జట్టుతో నిర్వాహకులు

పరిగి: ఈ నెల 29 నుంచి కర్నూలు జిల్లా నందికొట్కూరులో జరిగే రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు ఎంపికయ్యారు. పరిగిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల వేదికగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఈ ఎంపికలు జరిగాయి. ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం 70 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో 12 జట్లుగా క్రీడాకారులను విభజించి పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 48 మంది బాలబాలికలను రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జట్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో పీడీ ప్రకాష్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సత్యకృపారాజు, ఎస్జీఎఫ్ పరిశీలకుడు మొరార్జీయాదవ్, వివిధ పాఠశాలల పీడీలు, సీనియర్ క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.

రేపు మాజీ సైనికులు, వితంతువుల పింఛన్ పరిష్కార వేదిక

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: మాజీ సైనికులు, వితంతువుల ఎదుర్కొంటున్న పింఛన్ సమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 27న అనంతపురంలోని జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో వేదిక ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు మాజీ సైనిక సంక్షేమ శాఖ అధికారి రాచయ్య బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మద్రాస్ రెజిమెంట్‌కు సంబంధించిన మాజీ సైనికులు, వితంతువులు మాత్రమే పెన్షన్ సమస్యలపై తగిన ఆధారాలు తీసుకువచ్చి సంప్రదించాలని సూచించారు. పెన్షన్ పేమెంట్ ఆర్డరు, డిశ్చార్జ్ బుక్, అప్డేట్ బ్యాంకు పెన్షన్ పాసుపుస్తకంతో హాజరుకావాలని పేర్కొన్నారు.



ఎందరో వీరుల త్యాగఫలం

స్వాతంత్ర్య పోరాటంలో ఆసేతు హిమాచలం కదలివచ్చి సమరోత్సాహంతో తెల్లదొరల భరతం పట్టిన వారిలో అనంత వాసుల భాగస్వామ్యమూ ఉంది. తరాలు గడిచినా ఆ మహనీయుల వారసులు నేటికీ వారి జ్ఞాపకాలను పదిలంగా చూసుకుంటున్నారు. వారి ఆశయాలను సజీవంగా ఉంచేందుకు వివిధ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వాడవాడలా దేశభక్తిని చాటేలా మువ్వన్నెల జెండాలు రెపరెపలాడనున్నాయి. ఇలాంటి తరుణంలో త్యాగధనుల జ్ఞాపకాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం. – అనంతపురం కల్చరల్

సందర్భం - నేడు గణతంత్ర దినోత్సవం

అఖండ భరతావని స్వేచ్ఛా వాయువులు పీల్చుకుని, త్రివర్ణ పతాకం రెపరెపలాడిన ఆనందక్షణాలకు తీపి గుర్తుగా, నాటి దేశభక్తుల త్యాగాలకు చిహ్నంగా అనంతపురం నగర నడిబొడ్డున టవర్ క్లాక్ వెలిసింది. అమరవీరుల త్యాగాలకు గుర్తుగా నిర్మించిన ఈ కట్టడాన్ని సంపూర్ణ స్వాతంత్ర్యానంతరం 1952లో దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభించారు. దేశం కోసం సర్వమూ త్యాగం చేసిన పోరాట వీరుల గుండె చప్పుడు ప్రతిక్షణం వినబడేలా కట్టడంపై గడియారాన్ని ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్య దినోత్సవానికి (15.8.47) గుర్తుగా 15 అడుగుల వెడల్పు, 8 భుజాలు, 47 అడుగుల ఎత్తు ఉండేటట్లు నిర్మాణంలో ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు.



అనంతపురంలోని టవర్‌క్లాక్

చిరుప్రాయంలోనే స్వేచ్ఛానినాదం



అనంతపురానికి చెందిన వరదరాజుల రాజ్యలక్ష్మి చిరుప్రాయంలోనే తన తండ్రి ఆర్.రంగస్వామి అయ్యంగార్ వెంట తిరుగుతూ స్వాతంత్ర్య సమరాన్ని కళ్లారా చూశారు. ఆ రోజులను గుర్తు చేసుకుంటే నేటికీ ఎంతో ఉద్వేగానికి లోనవుతారు. 'మా నాన్న వాళ్ల చిన్నప్పుడే తమిళనాడు నుంచి బళ్లారికి వచ్చేశారు. అప్పుడు అనంతపురం.. బళ్లారిలో అంతర్భాగంగా ఉండేది. స్వతంత్ర భారతావని తొలి గవర్నర్ జనరల్ రాజాజీకి నా భర్త వరదరాజ చక్రవర్తి సమీప బంధువు. ఊహ తెలుస్తున్న రోజుల్లోనే తెల్లవారికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో బ్రిటీష్ వారి ఆగ్రహాన్ని చవిచూడాల్సి వచ్చింది. దేశభక్తుడు కల్లూరు రాధాకృష్ణను జైలులో నిర్బంధించినప్పుడు ఆయన విడుదల కోసం మా స్నేహితులతో కలసి పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి, నిరసన వ్యక్తం చేశాం. నా చిన్నప్పుడే గాంధీజీ, నెహ్రూతో పాటూ అప్పటి బ్రిటీష్ వైస్రాయ్ సర్ మౌంట్‌బాటన్‌ను అతి దగ్గరగా చూశాను' అని చెప్పే రాజ్యలక్ష్మి.. తొమ్మిది పదుల వయసులోనూ ఎంతో ఉత్సాహంగా ఉన్నారు.

నాన్న ఆశయ స్ఫూర్తితో..



ఉమ్మడి అనంత జిల్లాలోని కదిరికి సమీపంలోని ముత్యాలచెరువు గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీకాంతం శ్యామమూర్తి ఇటీవలే మరణించారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నా.. జీవిత చరమాంకంలో అనంతపురంలో ఉంటున్న రెండో కుమారుడు శ్రీకాంతం సుబ్బారావు వద్ద ఉండేవారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నాటి జ్ఞాపకాలను సుబ్బారావు దంపతులు 'సాక్షి'తో పంచుకున్నారు. 'దేశమాత దాస్యశృంఖలాలు తెంచడం ఎంత ముఖ్యమో.. అందరి ఆకలి తీర్చడం అంతే ప్రధానమని మా నాన్న చెబుతుండేవారు. స్వాతంత్ర్య పోరాటంలో దొన్నికోట వద్ద బ్రిటీష్ బంగ్లాను కాల్చేసిన ఘటనలో ఆయన జైలుకు వెళ్లారు. స్వాతంత్ర్యానంతరం భారత ప్రభుత్వంతో తామ్రపత్రం కూడా అందుకున్నారు. నేనైతే నాటి విశేషాలను కళ్లారా చూడలేదు కానీ, ఆయన మాత్రం నిత్యమూ మాతో స్వాతంత్ర్య ఉద్యమం సాగిన తీరునే వివరించి చెప్పేవారు. ప్రస్తుతం మా నాన్న మన మధ్య లేకపోయినా.. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ అన్నదాన ట్రస్టును ఏర్పాటు చేశాను. అందరి సహకారంతో అన్నదానం చేస్తున్నాం. పదిమంది ఆకలి తీర్చినప్పుడల్లా మాకు నాన్న సజీవంగా ఉన్నారనిపిస్తుంది'

యువకుడి అనుమానాస్పద మృతి



మృతుడు గోపీనాథ్

సోమందేపల్లి: మరో రెండు రోజుల్లో వివాహ నిశ్చితార్థం చేసుకోవాల్సిన యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. సోమందేపల్లికి చెందిన చింతా పార్థసారథి నాల్గో కుమారుడు గోపీనాథ్ (30), స్థానికంగా మరమగ్గాల నిర్వహణతో జీవనం సాగిస్తున్నాడు. మరో రెండు రోజుల్లో లేపాక్షి మండలంలోని ఓ యువతితో వివాహ నిశ్చితార్థానికి పెద్దలు ముహూర్తం నిర్ణయించారు. మంగళవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన గోపీనాథ్.. బుధవారం మధ్యాహ్నమైనా ఇంటికి చేరుకోలేదు. దీంతో గోపీనాథ్ వద్ద ఉన్న సెల్‌ఫోన్ లోకేషన్ ఆధారంగా కుటుంబసభ్యులు సోమందేపల్లిలోని గీతానగర్‌కు చేరుకుని పరిశీలించారు. ఓ చెట్టుకు ఉరి వేసుకుని విగతజీవిగా వేలాడుతూ కనిపించడంతో బోరున విలపించారు. కాగా, గోపీనాథ్ ఆత్మహత్య చేసుకునేంత పిరికి వాడు కాదని, ఈ మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయంటూ కుటుంబసభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

మహిళ ఆత్మహత్య



మృతురాలు అనసూయమ్మ

ధర్మవరం అర్బన్: భర్త మృతిని జీర్ణించుకోలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని శాంతినగర్‌కు చెందిన గోపాల్, అనసూయమ్మ దంపతులు. చేనేత వృత్తితో కుటుంబాన్ని పోషించుకుంటున్న గోపాల్ రెండు నెలల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. అప్పటి నుంచి కుమార్తె, మనవడు, మామతో కలసి జీవిస్తున్న తీవ్ర మనోవేదనతో అనసూయమ్మ బాధపడుతుండేది. ఈ క్రమంలో భర్తలేని జీవితం వ్యర్థమంటూ పలువురితో చెబుతూ వచ్చిన ఆమె.. జీవితంపై విరక్తితో బుధవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న ధర్మవరం రెండో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

వ్యక్తి బలవన్మరణం

సోమందేపల్లి: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... సోమందేపల్లి మండలం పోలేపల్లి నివాసి ఉప్పర ఆంజనేయులు (43)కు 13 ఏళ్ల క్రితం వెంకటలక్ష్మమ్మతో వివాహమైంది. ఇటీవల ఆంజనేయులు మద్యానికి బానిసయ్యాడు. మద్యం కొనుగోలు చేసేందుకు డబ్బు కావాలని తరచూ భార్యను వేధించేవాడు. ఈ నేపథ్యంలో కొన్ని రోజుల క్రితం డబ్బు కోసం భార్యతో గొడవ పడడంతో ఆమె అలిగి పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన ఆంజనేయులు బుధవారం తెల్లవారుజామున ఇంట్లో పైకప్పుకు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి



మృతుడు లక్ష్మీనారాయణ

యల్లనూరు: కారు ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. యల్లనూరు మండలం ఎస్.కొత్తపల్లి నివాసి తలారి లక్ష్మీనారాయణ (63) వ్యక్తిగత పనిపై బుధవారం ద్విచక్ర వాహనంపై తిమ్మంపల్లికి బయలుదేరాడు. గొడ్డుమర్రి సమీపంలో చింతచెట్టు వద్దకు చేరుకోగానే బెంగళూరు నుంచి దంతలపల్లి వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్న లక్ష్మీనారాయణను వెంటనే తిమ్మంపల్లిలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం పులివెందులలోని ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి కుమారుడు మల్లికార్జున ఫిర్యాదు మేరకు యల్లనూరు ఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మోసం చేసి ఉద్యోగం రాయించుకున్నారు!

- బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు

ధర్మవరం అర్బన్: మోసం చేసి తన కాంట్రాక్ట్ ఉద్యోగాన్ని వేరే వాళ్లకు రాయించారంటూ ధర్మవరం వన్ టౌన్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ధర్మవరంలోని లక్ష్మీచెన్నకేశవపురంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 15 ఏళ్లుగా కాంట్రాక్ట్ విధానంలో షిఫ్ట్ ఆపరేటర్‌గా దర్గావీధికి చెందిన వెంకటరమణమూర్తి విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆరు నెలల క్రితం కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స చేయించుకుంటున్నాడు. విషయాన్ని గమనించిన విద్యుత్ శాఖ డీ1 సెక్షన్ లైన్‌మన్లు ప్రసాద్, అశ్వత్థనారాయణ.. వారి బంధువైన అశోక చక్రవర్తికి ఉద్యోగం ఇప్పించేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో సెలవుపై ఇంటి వద్ద ఉన్న వెంకటరమణమూర్తి వద్దకెళ్లి 'నీ ఆరోగ్యం సరిగాలేదు కాబట్టి మెడికల్ బిల్లులు పెట్టిస్తాం' అంటూ నమ్మబలికి తెల్ల కాగితంలో సంతకాలు చేయించుకుని వెళ్లారు. అనారోగ్యం కారణంగా సెలవు పెట్టిన నెల రోజుల గడువు ముగియడంతో విధుల్లో చేరేందుకు వెంకటరమణమూర్తి వెళ్లాడు. ఆ సమయంలో అధికారులు అతన్ని విధుల్లోకి అనుమతించలేదు. ఉద్యోగాన్ని వేరే వాళ్లకు రాసిచ్చిన కారణంగా విధుల్లో నుంచి తప్పించినట్లు తెలపడంతో ఉన్నతాధికారులను కలసి తన గోడు వెల్లబోసుకున్నాడు. అయినా ఫలితం లేకపోవడంతో తనను మోసం చేసిన లైన్‌మన్లు ప్రసాత్, అశ్వత్థనారాయణ, వారి బంధువు అశోక్ చక్రవర్తిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై చీటింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అక్కినేని అభిమానులకు బాలకృష్ణ క్షమాపణ చెప్పాలి

- అక్కినేని నాగార్జున అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు సతీష్ డిమాండ్

అనంతపురం టవర్‌క్లాక్: అక్కినేని నాగేశ్వరరావుని కించపరిచేలా మాట్లాడిన సినీ హీరో బాలకృష్ణ తక్షణమే అక్కినేని అభిమానులకు క్షమాపణ చెప్పాలని అక్కినేని నాగార్జున అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు సతీష్ డిమాండ్ చేశారు. బుధవారం అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వీరసింహారెడ్డి సినిమా విజయోత్సవం సభలో బాలకృష్ణ మాట్లాడుతూ.. అక్కినేని నాగేశ్వరరావు, ఎస్వీ రంగారావుపై చేసిన అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. సినిమా పరిశ్రమలను మద్రాస్ నుంచి హైదరాబాద్‌కు తీసుకువచ్చిన ఘనత అక్కినేని నాగేశ్వరరావుకు దక్కుతుందన్నారు. సమావేశంలో రమేష్, జోసెఫ్, అలీ, నాగరాజు, గోపాల్, గోవిందరాజులు, ఆదినారాయణ, వెంకటేష్, షరీఫ్, షఫీ, అనిల్, బాలు, వెంకట్, గౌతమ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో బంగారు నగల అపహరణ

గార్లదిన్నె: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళ బంగారు నగలు అపహరణకు గురయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన లావణ్య సంక్రాంతి పండుగకు కర్నూలు జిల్లా డోన్‌లోని పుట్టింటికి వెళ్లింది. గత శుక్రవారం కల్లూరుకు వచ్చేందుకు డోన్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కిన ఆమె సీట్లు ఖాళీగా లేకపోవడంతో తన వద్ద ఉన్న లగేజీ బ్యాగును బస్సు డోర్ సమీపంలోని సీటు వద్ద పెట్టి వెనక్కు వెళ్లి కూర్చొంది. కల్లూరు చేరుకోగానే బస్సు దిగి ఇంటికి వెళ్లిన ఆమె లగేజీ బ్యాగును పరిశీలించింది. అందులో తాను ఉంచిన 9 తులాల బంగారు నగల బాక్స్ కనిపించలేదు. దీంతో వెంటనే డోన్‌కు వెళ్లి ఆరా తీశారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో బుధవారం గార్లదిన్నె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, డోన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు గార్లదిన్నె ఎస్‌ఐ సాగర్ తెలిపారు.

రిమాండ్‌కు 11 మంది

రాయదుర్గం రూరల్: మండలంలోని మెచ్చిరి గ్రామంలో గత గురువారం చోటు చేసుకున్న ఇరువర్గాల ఘర్షణలో 11 మందిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు. పోరంబోకు స్థల విషయమై ఇరువర్గాల వారు తగాదాపడి కర్రలు, మచ్చుకత్తులు, గొడ్డళ్లతో దాడులకు పాల్పడ్డారన్నారు. ఈ ఘటనలో కృష్ణారెడ్డి, శివారెడ్డి తదితర పది మంది గాయపడ్డారన్నారు. దాడులకు పాల్పడిన గొల్ల భీమప్ప, కిష్టప్ప, చిన్న రంగప్ప కుమారుడు శివణ్ణ, బసవరాజు, మల్లికార్జున, విఠల్, శ్రీకాంత్, చిన్న తిప్పేస్వామి, ఆదికేశవులు, మారెన్న, పెద్ద తిప్పేస్వామిపై కేసు నమోదు చేసి, బుధవారం న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు పంపినట్లు వివరించారు.

ప్రయాణికుల పాట్లు పట్టవా?

- రైలు పొడవుకు సరిపడ షెల్టర్లు లేవు



షెల్టర్ లేని ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం

గుంతకల్లు: భారతీయ రైల్వేలో ఇంధన పొదుపు చర్య ల్లో దక్షిణ మధ్య రైల్వేలోని గుంతకల్లు రైల్వేస్టేషన్ రెండో స్థానం సంపాదించింది. ఈ రైల్వేస్టేషన్ భవనాన్ని విమానాశ్రయంతో పోలుస్తూ రైల్వే మంత్రి స్వయంగా ట్వీట్ చేశారు. అంతటి పేరుగాంచిన ఈ స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌లకు అనుగుణంగా షెల్టర్లు లేవు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతకల్లు జంక్షన్ గుండా రోజూ వందకుపైగా ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లలో దాదాపు 15వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. నూతన రైల్వే స్టేషన్ భవనం, ప్లాట్‌ఫాంలు, విశ్రాంతి భవనాలు, ఎస్కలేటర్లు, లిఫ్టులు తదితర అభివృద్ధి పేరుతో రైల్వే శాఖ దాదాపు రూ.25 కోట్లు ఖర్చు చేసింది. అయితే 1, 6, 7వ ప్లాట్‌ఫామ్‌లలో రైళ్ల పొడవున్నంత మేర షెల్టర్లు నిర్మించలేదు. దీంతో ఇంజిన్‌కు మొదట నిలబడే బోగీలు, చివర నిలబడే బోగీల కోసం ప్రయాణికులు షెల్టర్లు లేని ప్లాట్‌ఫామ్‌లపై వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండకు ఎండుతూ, వానలకు తడుస్తూనే రైలు ఎక్కుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పై మూడు ప్లాట్‌ఫామ్‌ల వద్ద షెల్టర్లు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పప్పు.. ఎప్పటికీ నిప్పు కాలేడు

- ఫెయిల్యూర్ క్యాండిడేట్ పాదయాత్రతో ఒరిగేదేమీ లేదు
- అధికారంలో ఉన్నప్పుడు యువతను నిండాముంచాడు
- ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాతనే జనంలోకి రావాలి
- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



రాప్తాడు రూరల్: అధికారంలో ఉన్నప్పుడు యువత గొంతు నొక్కి ఇప్పుడేమో యువగళం పేరుతో వస్తున్న పప్పు (నారా లోకేష్) ఎప్పటికీ నిప్పు కాలేడని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. చంద్రబాబు అవుడేట్ క్యాండిడేట్ కాగా, లోకేష్ ఫెయిల్యూర్ క్యాండిడేట్ అని విమర్శించారు. బుధవారం అనంతపురం రూరల్ పరిధిలోని సిండికేట్ నగర్ పర్యటనకు వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. 2014 ఎన్నికలకు ముందు ఇంటికో ఉద్యోగం ఇస్తామని హామీనిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత యువతను నిలువునా మోసగించిన తీరును నేటికీ ఎవరూ మరవలేదన్నారు. ఎన్టీఆర్‌నే కాక టీడీపీ కార్యకర్తలకూ వారు చేసిన ద్రోహంపై ఆత్మ విమర్శ చేసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాతనే జనంలోకి రావాలని సూచించారు. లోకేష్ గతంలో హిందూపురం నుంచి సైకిల్‌యాత్ర చేపట్టి 30 కిలోమీటర్ల ప్రయాణం చేసేందుకు 3 రోజులు సమయం తీసుకున్నాడని, ఆ తర్వాత తన వల్ల కాదని చేతులెత్తేశాడని గుర్తు చేశారు. ప్రజల చేత ఎన్నుకోబడలేదు కాబట్టి లోకేష్‌కు నాయకుడిగా చెలామణి అయ్యే అర్హత కూడా లేదన్నారు. ప్రతిపక్ష నేతగా నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రలో కిలోమీటర్ల పొడవునా లక్షలాది మంది జనం కనిపించారన్నారు. ఇదే స్థాయిలో జనాన్ని చూపించాలనే ఆలోచనతో పదివేల మందిని పోగేసి చంద్రబాబు ఆర్భాటాలకు పోయి ప్రజల ప్రాణాలు బలిగొంటున్నాడని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు పుష్కరాలకు వెళ్లి 29 మందిని బలిగొన్నారని, ప్రతిపక్ష నేతగా ఇటీవల మరో 11 మంది మృతికి కారకుడయ్యాడని తెలిపారు. సభలు, సమావేశాలు నిర్వహణకు ప్రభుత్వం వ్యతిరేకం కాదన్నారు. అయితే నిబంధనలకు లోబడి నిర్వహించుకోవడం నిర్వాహకుల ధర్మమన్నారు. కేవలం నిబంధనలు అతిక్రమించడం వల్లనే కందుకూరు, గుంటూరులో సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోయారన్న విషయం గుర్తించాలన్నారు. ఈ క్రమంలోనే మరిన్ని ప్రాణాలు పోకూడదనే ఉద్దేశంతో నిబంధనలకు లోబడి సభలు ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం చెబుతోందన్నారు. ఈ విషయాన్ని వక్రీకరిస్తూ ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం సాగిస్తోందని మండిపడ్డారు. సీఎం వైఎస్ జగన్‌తో పోల్చుకునే అర్హత లోకేష్‌కు లేదన్నారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ రూ.లక్షలు అందజేసిన మహోన్నత వ్యక్తిగా సీఎం వైఎస్ జగన్ ఖ్యాతి గడించారన్నారు. పేదల సంక్షేమం వైఎస్ జగన్‌తోనే సాధ్యమవుతుందని విశ్వసించిన ప్రజలు వైఎస్సార్‌సీపీ వెంటే ఉన్నారన్నారు. రాబోవు ఎన్నికల తర్వాత టీడీపీ కనుమరుగవడం ఖాయమన్నారు.